ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 15 సంచిక : 08 ఏప్రియల్ 2010

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 16
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....
భీమవరం ..... 21-02-2010
చించినాడ .... 28-02-2010

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 21-02-2010, భీమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సత్యానికి రూపంలేదు, నామంలేదు, గుణంలేదు. మనకు రూపబుద్ధి, నామబుద్ధి ఉంది. రూపబుద్ధి, నామబుద్ధి ఉన్నవారు సత్యాన్ని అందుకోవటం కష్టం. అందుచేత భగవంతుడి యొక్క ఏదో రూపాన్ని, నామాన్ని పట్టుకొని, దానిని సపోర్టుగా తీసుకొని, వారి అనుగ్రహాన్ని సంపాదించి మనం బ్రాహ్మీస్థితిని పొందాలి. రామకృష్ణపరమహంసగారు శరీరం విడిచిపెట్టాక ఆయన దగ్గర ఉన్న ఒక భక్తుడు వివేకానందుడితో ఏమన్నాడు అంటే మనం ఎన్నుకొన్న గురువు సరియైనవాడేనా, ఆయన మనలను ఒడ్డుకు తీసుకొనిరాగలడా అని అడిగాడు. వివేకానందుడు ఏమనిచెప్పాడు అంటే గురువు మీద చలనంలేని విశ్వాసం ఉండాలి. ఆయనకు పాండిత్యం లేదు, డబ్బులేదు ఏమిలేకపోయినా ఆయనంటే నా మనస్సు ఇష్టపడుతోంది కాబట్టి ఆయనను గురువుగా ఎన్నుకొన్నాను, అందులో రాజీలేదు. నీకు ఇష్టంలేకపోతే ఇంకో గురువు దగ్గరకు వెళ్లవచ్చు అని చెప్పాడు. కొంతమంది గురువులు శిష్యులను ఎన్నుకొంటారు, కొంతమంది శిష్యులు గురువులను ఎన్నుకొంటారు. రామకృష్ణ పరమహంస ఆయనే శిష్యులను ఎన్నుకొనేవాడు. రండిబాబు మీకు ట్రైనింగ్ ఇస్తాను అని చెప్పేవాడు. ఏకలవ్యుడు ద్రోణాచార్యుడిని గురువుగా భావించి విలువిద్య నేర్చుకొన్నాడు. నా విషయంలో భగవానే నన్ను ఎన్నుకొన్నారు. రమణభగవాన్ గురించి నాకు ఎవరూ చెప్పలేదు, ఏ

పుస్తకంలోను చదువలేదు, ఆయనే నాకు స్వప్నదర్శనం ఇచ్చి, నన్ను ముద్దుపెట్టుకొని ఆయన ఒడిలోనికి తీసుకొన్నారు.

పుట్టటం చావటం, మరల పుట్టటం చావటం ఇలా మనం జననమరణ ప్రవాహంలో కొట్టుకొనిపోతూ ఉంటాము. ఈ మహాప్రవాహంలో నుండి మనలను బయటకులాగి జనన మరణములతో సంబంధం లేని బ్రాహ్మీస్థితిని కలుగజేయటం ఒక్క గురువుకే సాధ్యం. అయితే రకరకాల గురువులు ఉంటారు. కొంతమంది గురువులు ఎలా ఉంటారు అంటే మామిడిపండు ఇలా ఉంటుంది అంటే తొక్క ఇలా ఉంటుంది, రసం ఇలా ఉంటుంది, టెంక ఇలా ఉంటుంది అని మామిడిపండు గురించి చెప్పి వదిలేస్తారు. కొంతమంది గురువులు ఎలా ఉంటారు అంటే మామిడిపండు గురించి చెప్పటమేకాదు, దానిని తీసుకొనివచ్చి మీ చేతిలో పెట్టి దానిని మీచేత తినిపింపచేస్తారు. అటువంటి ఉత్తమమైన గురువులు కూడా ఉన్నారు. భగవద్గీతలో చెప్పిన మాటలు కొంతమందికి రుచిగా ఉంటాయి, కొంతమందికి చేదుగా ఉంటాయి. మీకు పూర్వపుణ్యం లేకపోతే ఆ మాటలు మీకు చేదుగా ఉంటాయి. ఐన్‌స్టీన్ ఏమన్నాడు అంటే తెలివితక్కువ బుర్రలకు, పనికిరాని తలకాయలకు గొప్పగొప్ప ఆలోచనలు చెప్పినా అవి లోపలకు తీసుకోవు, వాటిని ఊసేస్తాయి. అటువంటివారికి ఉదాత్తమైన ఆదర్శాలగురించి చెప్పినా అందులో ఉన్న లోతు తెలియక నాసిరకం తలకాయలు వాటిని అంగీకరించవు, వాటిని తిరస్కరిస్తాయి, అవి అబద్ధాలు అని చెపుతాయి. అందుచేత భగవద్గీతలోని మాటలు మీకు నచ్చకపోతే మన బుర్రలు నాసిరకం అని అనుకోవాలి కాని భగవంతుడు చెప్పిన మాటలు అబద్ధం అని అనుకోవద్దు.

శ్రద్ధ వలన జ్ఞానం కలుగుతుంది. ఆచార్యులవారు ఏమన్నారు అంటే ఏ పరిసరాలలో ఉన్నప్పుడు నీకు భగవంతుడిపట్ల భక్తి కలుగుతోందో, శ్రద్ధ కలుగుతోందో ఆ పరిసరాలలో జీవించటం నేర్చుకో. ఆధ్యాత్మిక వాతావరణం అభివృద్ధి చేసుకోవటానికి నువ్వు ప్రయత్నం చెయ్యి, డబ్బువలనగాని, పాండిత్యంవలనగాని, కీర్తివలనగాని నువ్వు ఒడ్డుకు రాలేవు. భగవంతుడిమాటను ప్రమాణంగా తీసుకొని తదనుగుణంగా జీవించటం నేర్చుకుంటే నువ్వు ఒడ్డుకు వస్తావు. ఈ చుట్టాలు, స్నేహితులు నిజం అనుకొని మురిసిపోవద్దు. ధనం ఉన్న వాడికి చుట్టాలు గాని ధనంలేనివాడికి చుట్టాలు ఏమిటి? సంసారవాసన కొంచం ఉన్నా

మీకు బ్రహ్మజ్ఞానం కలుగదు అని రామకృష్ణుడు చెప్పారు. సూదిలోనికి దారం పెడతాము. దారం సరిగా ఉంటే దారపు పోగులు చెదిరిపోకుండా ఉంటే దారం బాగా వెళుతుంది. అందులో ఒక్కపోగు రేగిపోయింది అనుకోండి ఇంక దారం సూదిలోనికి వెళ్లదు. అలాగే ఒక వంతు నీకు సంసారంలోనికి మనస్సు వెళుతున్నా నీకు బ్రహ్మజ్ఞానం కలుగదు అని రామకృష్ణుడు అన్నారు. భగవాన్ ఏమి చెప్పారు అంటే నీకు దేహబుద్ధి ఉన్నంతకాలం నిన్ను సంసారం విడిచిపెట్టదు అని చెప్పారు. తత్వం తెలిసేవరకూ సంసారం నిన్ను వెంటాడుతుంది.

మీరు ఇంటి దగ్గర చేసుకొనే పనుల విషయంలో బద్ధకించవద్దు. భగవంతుడు మీకు కేటాయించిన పనిని శ్రద్ధగా చేయండి. మీ పని మీరు చేసుకోకపోతే దేహయాత్ర ఎలా నడుస్తుంది. మీ సంసారానికి సంబంధించిన పనులు అయిపోయిన తరువాత సమాజానికి ఉపయోగపడే పనులు కూడా చేస్తూ ఉండండి. నీకు అవకాశం ఉంటే కళ్యాణకర్మలు చెయ్యి. నువ్వు మంచిపనులు చేయటంవలన శారీరక ఆరోగ్యం బాగుపడుతుంది, మానసిక ఆరోగ్యం బాగుపడుతుంది. భగవద్గీతలో ఏ పని అయితే చెయ్యమని చెప్పాడో ఆ పనే చెయ్యి, వద్దని చెప్పిన పని జోలికి వెళ్లకు. ఎందుకు వద్దని చెప్పాడు అని ఎదురు తిరగకు, ఆయన చెప్పింది చెయ్యి. భగవంతుడికంటే, మన గురువుకంటే మనలను ప్రేమించేవారు ఎవరు ఉండరు. ఆయన మనలోనే ఉన్నాడు. ఆ ఎరుక మనకు లేకపోవటం వలన ఆయన కోసం లోకం అంతా తిరుగుతున్నాము. మనకు లోచూపు లేకపోవటం వలన అది మనకు అవగాహన అవ్వటంలేదు. నాకు పూజ అలవాటు తక్కువ అని ఈ మధ్య ఒకరు అడిగారు. సాధన రెండు రకాలు. 1. బహిరంగ సాధన, 2. అంతరంగసాధన. రమణమహర్షిగారు చెప్పిన విచారణ అంతరంగ సాధన. బహిరంగసాధన అంటే భక్తి మార్గంలో ప్రయాణం చేయటం. ఏదో అవతారమూర్తిని తీసుకొని ఆయనకు పూజచేయటం, ఆయన నామాన్ని జపించుకోవటం, ఆయన రూపాన్ని ధ్యానించుకోవటం దీనిని బహిరంగ సాధన అంటారు. అంతరంగసాధన అంటే విచారణమార్గం. మనం ఏదైతే నేను నేను అంటున్నామో అది నిజమైన నేనుకాదు, నిజమైన నేను వేరే ఉంది, అది మన హృదయంలోనే ఉంది. మనం నేను నేను అనుకొనేది దొంగనేను. అది దేహంతో, లోకంతో కలిసి ఉంటుంది, అది తనంతట తానుగా ఉండలేదు ఏదో విషయాలను చింతిస్తూ ఉంటుంది. నువ్వు శరీరాన్ని చంపటంకాదు, ఏదైతే నేను నేను అని చెపుతున్నావో ఆ నేనును చంపు. విషయచింతన చేసే ఈ నేనును, భౌతిక

భోగాల గురించి ఆలోచించే ఈ నేనును పట్టుకొని దానికి దైవచింతన అలవాటు చెయ్యి. మంచిపనులు చేసేవారితో సహవాసం చెయ్యి, మంచిపనులు చెయ్యటం వలన నలుగురు సంతోషించవచ్చు అది ముఖ్యంకాదు, మంచిచేయటం వలన నీ బుద్ధి శుద్ధి అవుతుంది. మంచి గ్రంథాలను ఇంట్లో పెట్టుకోవటంకాదు, వాటిని ఎప్పుడైనా చదువుతూ ఉండు. ప్రాణంలేని శరీరం ఎటువంటిదో మంచి గ్రంథాలు లేని కొంప కూడా అటువంటిదే.

నన్ను స్మరించుకోండి అని భగవంతుడు చెప్పినా మీకు చిత్తశుద్ధి లేకపోతే, ఏకాగ్రత లేకపోతే మీరు ఆయనను స్మరించుకోలేరు. మీరు మంచిపనులు చేయటంవలన, మంచి గ్రంథాలు చదవటంవలన, మంచి స్నేహాలు చేయటం వలన మీకు చిత్తశుద్ధి కలుగుతుంది. వినయం లేనివాడు ఎందుకూ పనికిరాడు. వినయం పోయింది అవినయం వచ్చేసింది అనుకోండి వాడికి ఆధ్యాత్మికదారిద్ర్యం వచ్చేస్తుంది. మనకు ఆర్థికదారిద్ర్యం లేకపోయినా ఆధ్యాత్మికదారిద్ర్యం ఉంటే ఇంక మనకు వికాశం కలుగదు. మనకు వినయం ఉండాలి. వినయం పోతే అన్నీ పోయినట్లే. మేము బాగా డబ్బు సంపాదిస్తున్నాము అని కొంతమంది అంటూ ఉంటారు. దానివలన ఇంట్లోనివారు విరోధులు అవుతారు, సమాజంలో చాలామంది నిన్ను చూసి అసూయపడతారు. నీకు బతకటానికి డబ్బు అవసరమేకాని అర్థం పెరిగే కొలదీ నీ కొంపకు అనర్థాలు వస్తాయి. అసలు మనకు సత్యాన్వేషణ లేదు. రాగద్వేషముల మధ్య తిరుగుతూ ఉంటాము. ఇష్టమైన వారిపట్ల ఒకరకంగా ఉంటాము, ఇష్టంలేనివారిపట్ల వేరొక రకంగా ఉంటాము. వారికి ఉపకారం చేస్తాము, వీరికి అపకారం చేస్తాము. నిన్ను ఈ రకంగా వ్యవహరించమని భగవంతుడు చెప్పాడా? ఇది భగవంతుడు చెప్పిన పనా. మీరు జాగ్రత్తగా ఆలోచించుకోండి. నన్ను ఉపాసన చెయ్యి అని భగవంతుడు చెప్పాడు. మీకు ఎంత పాండిత్యం ఉన్నా ఉపాసన లేకుండా భగవంతుడు మీకు అనుభవంలోనికి రాడు. లోకం నీకు మోక్షాన్ని ఇవ్వదు, నీకు మోక్షాన్ని భగవంతుడు ఇస్తాడు. అందుచేత ఆయన ప్రీతికోసం పనిచెయ్యి, ఆయన ప్రీతికోసం మాట్లాడు. నీ అహంకారంలో నివసించటంకాదు, నువ్వు భగవంతుడిలో నివసించటం నేర్చుకో. మనస్సుకు క్రమశిక్షణ నేర్పాలి. మనస్సు పవిత్రమవ్వాలి. పవిత్రమైన మనస్సుకు లోచూపు కలుగుతుంది. లోచూపు కలిగినవారికి లోపలఉన్న భగవంతుడు అనుభవంలోనికి వస్తాడు గాని బాహ్యంగా తిరుగుతున్న మనస్సుకు భగవంతుడు అందడు.

సర్వత్రా సమబుద్ధాయం అంటే కాలమాన పరిస్థితులు ఎలా ఉన్నా ఎల్లప్పడు సమాన బుద్ధిని కలిగి ఉండండి. మనిషి జీవితం ఎప్పడూ ఒకేరకంగా ఉండదు, హెచ్చుతగ్గులు వస్తూ ఉంటాయి. పరిస్థితులు ఎలా ఉన్నా సమానబుద్ధిని కలిగి ఉండండి. భగవంతుడు చెప్పిన ఈ మాటను మనస్సులో పెట్టుకోండి. లోపల ఉన్న సత్యవస్తువు హెచ్చుతగ్గులుగా ఉండదు, సమానంగా ఉంటుంది. మిమ్మల్ని అదృష్టం వెంటాడినా, దురదృష్టం వెంటాడినా మీరు సమాన బుద్ధిని కలిగి ఉంటే లోపల సమానంగా ఉన్న వస్తువులో ఐక్యమవుతారు. సర్వభూత హితేరతాః అందరి క్షేమాన్ని కోరుకో. నువ్వు ఇతరులకు డబ్బు ఇవ్వలేకపోవచ్చు, పండ్లు ఇవ్వలేకపోవచ్చు. వారు క్షేమంగా ఉండాలి, వారు బాగుపడాలి అని అనుకోవటంలో దారిద్ర్యం వద్దు. మనస్సులో దారిద్ర్యం పెట్టుకోవద్దు. ఏసుక్రీస్తును శిలువ వేసినప్పడు ప్రజలందరూ ఆయనను వదిలేసారు. మనలను కూడా శిలువ వేస్తారేమోనని భయపడి శిష్యులు కూడా వదిలేసారు. తల్లిమాత్రం ఆయన దగ్గరే ఉంది. క్రీస్తు దేవుని కుమారుడు అని ఈరోజు వరకు కూడా తిరిగినవారు అందరూ వదిలేసారు. ఇంత నిర్మలంగా, నిశ్చలంగా ఈ శిలువ బాధను భరిస్తున్నాడు అని ఆశ్చర్యంగా చూస్తోంది. అప్పడు తల్లి ఏమంది అంటే మనుషులు నిన్ను వదిలేసారు, శిష్యులు నిన్ను వదిలేసారు కాని ఈశ్వరుడు నిన్ను విడిచిపెట్టలేదు. ఈశ్వరుడి ప్రేమ వరదలై నీ శిరస్సు మీద వర్షిస్తోంది. అందుకే ఇంత బాధను తట్టుకొంటున్నావు ఏసు అంటుంది తల్లి.

నీ స్వభావానికి అనుగుణమైన పనే చెయ్యి. ఎవరో చేసారని నీ స్వభావానికి విరుద్ధమైన పని చెయ్యవద్దు. భౌతిక భోగాలకు ఆకర్షింపబడవద్దు. నువ్వు ఏ పని అయితే నేచురల్‌గా చెయ్యగలవో ఆ పనే చెయ్యి. మన స్వభావానికి అనుగుణమైన పనులు చేస్తూ ఉంటే శరీరం చనిపోయినప్పడు శాంతిగా బయటకు పోతాము, మన స్వభావానికి విరుద్ధమైన పనులు చేస్తూ ఉంటే అశాంతిగా వెళతాము. ఐన్‌స్టీన్ ఈవెన్ మైండెడ్, ఆయనది మోస్ట్ ఇంపెర్సనల్ లైఫ్. ఆయన చనిపోయేటప్పడు నలుగురు స్నేహితులు, నలుగురు బంధువులను పిలిచి నేను చనిపోయాక ఐన్‌స్టీన్ చనిపోయాడు అని లోకానికి తెలియపరచకండి, మీరు స్మశానానికి తీసుకొనిపొండి, శవాన్ని ఎక్కడైతే కాల్చారో తెలియపర్చవద్దు. అక్కడనుండి ఏవో సమాధులు అంటారు, ఇవన్నీ నాకు ఎందుకు అంటాడు. అటువంటి వారు ఒక అవతారపురుషుడిని ఆరాధించకుండా నిర్గుణస్థితిని పొందగలరు. మీ జీవితంలో హెచ్చుతగ్గులు ఎందుకు వస్తాయి అంటే మీకు పాఠాలు నేర్పటానికి ఇవన్నీ భగవంతుడు చేస్తున్నాడు. ఏ

రోజుకారోజు పాఠాలు నేర్చుకోవాలి. రోజుకో కొత్త విషయం నేర్చుకోండి. తప్పలు చేసారు అనుకోండి. తప్పలు చేసాము, తప్పలు చేసాము అని అనుకోవద్దు. ఏదో జరిగిపోయింది. చేసిన తప్పలు మరల చెయ్యవద్దు. జరిగిపోయిన దానికి మీరు ఏమి చేస్తారు. భవిష్యత్ గురించి జాగ్రత్తగా ఆలోచించుకోండి. ఏరోజుకారోజు లోపలకు వెళ్ళటం నేర్చుకోండి. ప్రయత్నంలో ఫెయిల్ అయినా అక్కడే కూర్చోవద్దు, మరల ప్రయత్నం చేయండి. నాకు తప్పలు చెయ్యాలని లేదు కాని తప్పలు చేస్తున్నాను ఎందుకు అని అర్జునుడు అడిగితే కామక్రోధాలు నీచేత చేయిస్తున్నాయి అని పరమాత్మ చెప్పాడు. కళ్యాణగుణాలను అలవర్చుకో. ఎవరికో ఉన్నాయి నాకు లేవు అని కూర్చోవద్దు, కళ్యాణగుణాలను ప్రాక్టీసుచెయ్యి నీకు కూడా వస్తాయి. ఈ దేహము అసత్యం, ఈ లోకం అసత్యం, ఈ పరిస్థితులు అసత్యం అని ఎవడికైతే అనుభవంలోనికి వచ్చిందో వాడు గురువుతో సంబంధం లేకుండా, అవతారపురుషుడితో సంబంధం లేకుండా బ్రాహ్మీస్థితిని పొందుతాడు. అటువంటివారు కొద్దిమంది మాత్రమే ఉంటారు. వారిని అనుకరించవద్దు. నువ్వు ఏ పరిస్థితిలో ఉన్నావో అర్థం చేసుకొని, నీలో ఉన్న బలహీనతలు ఏమిటో చూసుకొని వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి. మనం ధనవంతులకు, అదృష్టవంతులకు హృదయంలో స్థానం ఇస్తాము. దురదృష్టవంతులకు, పరిస్థితుల ప్రభావం వలన బాధలు పడేవారికి మన హృదయంలో స్థానం ఇవ్వము. నువ్వు అదృష్టవంతుల క్షేమాన్ని కోరుకొని దురదృష్టవంతుల క్షేమాన్ని కోరుకోకపోతే ఎలాగ, వారి ప్రారబ్ధాన్ని బట్టి వారు అలాగ ఉన్నారు, వారి గోల నీకు ఏల. వారిని ప్రేమించటంలో, వారిని ఆప్యాయతగా పలకరించటంలో దారిద్ర్యం ఎందుకు? నువ్వు అందరిని సమానంగా ప్రేమించు. నువ్వు అందరిని ఉద్ధరించలేకపోవచ్చు. నీ శక్తిని బట్టే సహాయం చెయ్యి. లోకంలో ఎంతోమంది దరిద్రులు ఉన్నారు నేను ఎక్కడ ఉద్ధరించగలను అనుకోవద్దు. నీ అర్హతను బట్టి ఒక్కడికి సహాయం చెయ్యి. ఒక్కడికి సహాయం చెయ్యటం మానేసి లోకాన్ని అంతా మేము ఎక్కడ ఉద్ధరించగలము అని ఇటువంటి మాటలు, వాస్తవపరిస్థితులకు దూరమైన మాటలు మాట్లాడవద్దు.

మీరు పనిచెయ్యండి. మీ ప్రారబ్ధం ఇలా ఉంది అని ఏడుస్తూ కూర్చోవద్దు. గొర్రెపోతులు ఎలా పోట్లాడుకుంటాయో ప్రారబ్ధం పురుష ప్రయత్నం అలా పోట్లాడుకొంటాయి. మీరు ధైర్యంగా ఉండి ప్రారబ్ధంతో పోట్లాడండి. ఈశ్వరుని పాదాలయందు విశ్వాసం కలిగి ఉండండి. నువ్వు

చేసే పని హృదయపూర్వకంగా చెయ్యి. అందరిలోను పరమాత్మ ఉన్నాడు కదా నువ్వు ఎవ్వరినీ ద్వేషించవద్దు. కర్మను సన్యసించవద్దు. కర్మఫలితాన్ని సన్యశించు. మన హృదయంలో ఉన్న ఆనందస్థితి మనకు అందకుండా దేహగతమైన నేనే మనకు అడ్డు వస్తోంది. ఏసుక్రీస్తు శరీరం ఎలా శిలువ వేయబడిందో అలాగ ఈ దేహగతమైన నేనును శిలువ వేస్తేగాని నువ్వు ఆనందస్థితిని పొందలేవు. భగవంతుడు ఎలా చెపితే అలాగ నడుచుకోవటమే మన పని. మన మతంలో టీచింగ్ తగ్గిపోతోంది. పూర్వకాలం గుడులలో హరికధలు, పురాణాలు చెప్పేవారు. ఇప్పుడు అంతా సినిమాలు, డాన్సులు. అసలే మనం కామక్రోధాల నుండి బయటకు రాలేకపోతున్నాము అంటే ఈ సినిమాలు, డాన్సులు ఇంకా కామక్రోధాలను పెంచేస్తాయి. ఇక్కడ సత్రవులు కడతాము, భోజనాలు పెడతాము, మీరు ఎంత చందా ఇస్తారు, ఇంక ఇదే పని టీచింగ్ వదిలేసారు. డబ్బు ఉంటే మంచిపనులు చెయ్యవచ్చు టీచింగ్ వదిలేస్తే ఎలాగ. నువ్వు అన్నం పెట్టు అది సెకండరీ. వాడి దేహానికి అన్నం పెడుతున్నావు మరి ఆ జీవుడికి ఏమి పెట్టావు? గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే అర్జునా నీకు నాకు జరిగిన ఈ సంభాషణను అధ్యయనం చేసి, అర్ధం చేసుకొని, అనుభవంలోనికి తెచ్చుకొని, ఆ మాటలను ఇతరులకు అర్ధమయ్యేలాగ ఎవడైతే చెపుతున్నాడో వాడు నాకు అత్యంత సన్నిహితుడు అత్యంత ప్రీతిపాత్రుడు అని చెప్పాడు. భగవంతుడు ఏ పని చెప్పాడో ముందు అది చెయ్యి. నీ జీవిత గమ్యం ఏమిటి భోజనాలు పెట్టటం, కాలేజీలు కట్టించటం నీ గమ్యం కాదు, డబ్బుంటే అటువంటి మంచి పనులు చెయ్యి అదే నీ జీవితగమ్యం కాదు. నువ్వు సత్యానుభవం పొందాలి అదే నీ జీవితగమ్యం. ఆ గమ్యాన్ని పొందటానికి ప్రయత్నం చెయ్యి.

నన్ను ప్రేమించు, నన్ను ఉపాసన చెయ్యి, నన్ను జపించు, నీ మనస్సును నాకు ఇచ్చెయ్యి అని భగవంతుడు పదే పదే చెపుతున్నాడు. ఎందుచేతనంటే మనం విషయసుఖాలకు, భౌతికభోగాలకు అలవాటుపడి పతనమవుతున్నాము. వాటిలోనుండి మన మనస్సును బయటకు లాగి భగవంతుడి వైపుకు మనస్సును మళ్ళించటానికే ఇది అంతా చెపుతున్నాడు. మీరు ఒకటి జ్ఞాపకం పెట్టుకోండి. ఈ శరీరం చనిపోయిన తరువాత బంధువులతోటి, స్నేహితులతోటి సంబంధం తెగిపోతుంది. కాని గురువుతో సంబంధం తెగదు, అది జన్మజన్మలకు కంటిన్యూ అవుతుంది. గురువు ఏ స్థితిని పొందాడో ఆ స్థితికి మనలను చెర్చేవరకు ఆయన

మనలను విడిచిపెట్టడు. గురువు అంటే సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు. పూర్వజన్మలనుండి వస్తున్న వాసనలను నీలోనుండి బయటకు లాగి వాటిని కాల్చిబూడిద చేసి నీ హృదయాన్ని జ్ఞానంతో, కాంతితో, ఆనందంతో నింపుతాడు, వాడు గురువు. ఒకసారి నారదుడు రాముడిని అడుగుతాడు. రామా నీ పాదాలయందు భక్తిని ప్రసాదించు అన్నాడు. అలాగే ఇస్తాను ఇంకా ఏమైనా కావాలా అని అడుగుతాడు. ఈ ప్రపంచం అంతా నీ మాయ, ఇదంతా నీ కల్పితం. ఈ ప్రపంచంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి. నీ తాలుక మాయలో ఎక్కడ పడిపోతానో అని భయంగా ఉంది. ప్రపంచంలో ఉన్న ఆకర్షణలలో, నీ మాయలో పడకుండా చూడు అదే నా మొదటికోరిక, నా చివరికోరిక కూడా అదే అన్నాడు, రాముడు తదాస్థు అంటాడు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-02-2010, చించినాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం ప్రతీ చిన్న విషయానికి గుర్తింపులు కోరుకొంటాము. మనం పాడైపోవటానికి కారణం అదే అని మనకు తెలియటం లేదు. దేవుడి బొమ్మను ఎదురుగా పెట్టుకొని ఆయనను పూజిస్తూ ఆయన మాట మనం వినకపోతే మనకు మోక్షం రాదు. మన తల్లితో అమ్మా నువ్వు చాలామంచిదానవు అని చెపుతూ అమ్మమాట ఒక్కమాట వినకుండా ఉంటే ఆ అమ్మ మన గురించి ఏమనుకుంటుందో దేవుడు కూడా అలాగే అనుకొంటాడు. కర్మలో అకర్మను చూడండి అని పరమాత్మ చెప్పాడు. కర్తృత్వం లేకుండా పని చేస్తే, గుర్తింపులు కోరుకోకుండా ఉంటే వాడు పని చేసినా చెయ్యనివాడితో సమానము. వాడు కర్మలో అకర్మను చూస్తున్నట్లు, అప్పుడు కర్మవాడిని ముట్టుకోదు, కర్మవాడిని బంధించదు, వాడికి చిత్తశుద్ధి కలుగుతుంది. మనం కర్తృత్వంతో పనిచేస్తాము కాబట్టి కర్మ మనలను వెంటాడుతుంది. మనం గుర్తింపులు కోరుకొనేకొలది కర్తృత్వం పెరిగిపోతుంది. వ్యక్తిభావన తగ్గించుకొంటూ పని చేయటం నేర్చుకోవాలి. వ్యక్తిభావన లేకుండా పనిచేయటం నేర్చుకొంటే మనం శాంతిగా ఉంటాము, మనకు మోక్షసుఖం అందుతుంది. సంసారం అనేది ఒక రోగం. ఒక్క ఈశ్వరుడు తప్పించి, గురువు తప్పించి ఈ సంసార రోగంలోనుండి మనలను ఎవరూ విడుదల చేయలేరు. సర్వసాధారణంగా సంసారంలో నూటికి పదివంతులు సంతోషం ఉంటే 90 వంతులు దుఃఖం ఉంటుంది. ఈ పదివంతులు సంతోషం కోసం 90 వంతులు దుఃఖం అనుభవిస్తూ ఉంటాము.

కర్తృత్వంతో పనిచేస్తున్నంతకాలం సంసారం నిన్ను విడిచిపెట్టదు, పునర్జన్మలు విడిచిపెట్టవు. అంటే కర్మ చేసేటప్పుడు అది ఎలా చెయ్యాలి అనేది తెలుసుకొని చెయ్యి.

మీకు ఎదుటివారిలో ఉన్న మంచి కనిపిస్తూ ఉంటే నీ మనస్సు మంచిది అని అర్థం, ఎదుటివారిలో ఉన్న చెడ్డ కనిపిస్తూ ఉంటే నీ మనస్సు చెడ్డది అని అర్థం. దానినిబట్టి నీ మనస్సు ఎటువంటిదో అంచనా వేసుకో. ఎంతచెడ్డవాడిలో అయినా నూటికి ఒకవంతు అయినా మంచి ఉంటుంది. అందుచేత ఇవన్నీ నువ్వు జాగ్రత్తగా పరిశీలించుకొని నీ మనస్సును బాగుచేసుకో అని మళయాళస్వాములవారు చెప్పారు. మనం భక్తి వలన భగవంతుడిని ప్రేమించవచ్చు, భయంవలన కూడా భగవంతుడిని ప్రేమించవచ్చు. గోపికలు కృష్ణుడిని భక్తి వలన ప్రేమించారు. మనం ఈ చెడ్డ చేస్తే భగవంతుడు శిక్షిస్తాడేమో అని భయంవలన కూడా మనకు భక్తి వస్తుంది. నీకు ఉన్న భక్తి నిజమైతే అందులోనుండి ఎంతోకొంత ప్రేమ రావాలి. ఆ భక్తిలో నుండి ప్రేమ ఏమీ రావటం లేదు అనుకో అది కూడా ఒక భక్తేనా అన్నాడు రామానుజుడు. మనందరం ఏదో కారణం వలన భగవంతుడిని ప్రేమిస్తాము కాని గోపికలకు భౌతికమైన కారణాలు ఏమీ లేవు, వారిది అకారణభక్తి. ఈశ్వరుడి పట్ల విశ్వాసం కలిగి ఉండండి. శ్వాసపోయినా విశ్వాసం పోకూడదు అని చెపుతూ ఉంటారు కాని ఈశ్వరుడి దయ లేకుండా ఆయన పట్ల విశ్వాసం కూడా సాధ్యంకాదు. ఇప్పుడు మనకు ఎంతోకొంత విశ్వాసం ఉంది. అందులో హెచ్చుతగ్గులు ఉంటాయి, అలా కాదు. మన పరిస్థితులు ఎలా ఉన్నా ఈశ్వరుడిపట్ల విశ్వాసం జీవనదిలా ప్రవహిస్తూ ఉండాలి. ఏ దేశం వెళ్ళినా, ఎవరింటికి వెళ్ళినా రాగద్వేషములు తప్పించి ఈ లోకంలో ఏముంది అన్నాడు బుద్ధుడు. ప్రపంచం అంతా రాగద్వేషములతో కూడి ఉంటుంది. వాటిలో నుండి బయటకు రా. మనం ఇష్టాలు, అయిష్టాలు తగ్గించుకోవాలి. అందరి హృదయాలలో బ్రహ్మం సమానంగా ఉంది. బ్రహ్మం ఎంత సమానంగా ఉందో మన మనస్సు కూడా అంత సమానం అయితే నది వెళ్ళి సముద్రంలో కలిసినట్లుగా ఈ మనస్సు వెళ్ళి బ్రహ్మంలో ఐక్యమవుతుంది.

సత్వగుణాన్ని ప్రాక్టీసు చెయ్యి. సత్వగుణంలో నువ్వు స్థిరపడాలి. సత్వగుణాన్ని ఆశ్రయించి రజోగుణాన్ని, తమోగుణాన్ని విడిచిపెట్టాలి. భయము, కోపము, ద్వేషము ఈ పాడు గుణాలు అన్నీ మనస్సులో ఉంటాయి. మనస్సు కాలిపోతే ఈ గుణాలు అన్నీ కాలిపోతాయి. ఏక వస్తువును చింతించటం వలన కూడా మనస్సు నశిస్తుంది. మనం భగవంతుడిని ప్రార్థించగా, ప్రార్థించగా

ఆ ప్రార్థించే మనస్సు నశిస్తుంది. మనకు ఏ కారణం వలన దుఃఖం వచ్చినా భగవంతుడి మీద విశ్వాసం లేదని అర్థం. ఆయన పట్ల విశ్వాసం ఉన్న వాడికి దుఃఖం లేదు, అశాంతి లేదు, భయంలేదు. నాన్నగారు మీకు సేవ చేసుకోవాలని ఉంది ఎలా చెయ్యమంటారు అని ఒకరు మా ఇంటికి వచ్చి అడుగుతున్నారు. మీరు మాకు సేవ చేయవద్దు, ఆ వాక్యం సరిపోతుంది అని చెప్పాను. నాకు సేవ చేయాలని అని మీ మనస్సులో ఉంది, అది మీ సహృదయానికి గుర్తు, దానికి కూడా భగవంతుడు మార్కులు వేస్తాడు. శరీరం కంటే మనస్సు ముఖ్యం. శరీరంతో మీకు ఏమీ ఉపకారం చెయ్యలేకపోయినా మీరు అందరూ సుఖంగా ఉండాలి, శాంతిగా ఉండాలి అని నేను కోరుకుంటే అది మనస్సుతో చేసే కర్మ. శరీరంతో చేసే కర్మకంటే మనస్సుతో చేసే కర్మకు భగవంతుడు ఎక్కువ మార్కులు వేస్తాడు. లోపల విషం పెట్టుకొని బయట తియ్యటి మాటలు మాట్లాడినా ప్రయోజనం లేదు. భగవంతుడు నీ మనస్సులో ఏమి ఉంది అని మనస్సును చూస్తాడు. అందుచేత మనస్సును బాగుచేసుకోవాలి. మా తప్పు ఏమీలేకపోయినా ఏవో మాటలు అనేస్తున్నారు అని కొంతమంది బాధపడుతూ ఉంటారు. మీ లోపల ఏ బలహీనతలు ఉన్నాయో మీకు తెలియదు. వాటిని మీకు తెలియజేయటానికే భగవంతుడు వారిని పనిముట్టుకింద ఉపయోగించుకొంటున్నాడు అని గుర్తుంచుకో అన్నారు మధ్వాచార్యులవారు. డబ్బు ఎటువంటిదో, పాండిత్యం కూడా అటువంటిదే. పండితులు ఏమి చేస్తారు అంటే ఆ శబ్దం ఎలా ఉత్పత్తి అయ్యింది, ఆ శబ్దానికి అర్థం చెపుతూ ఉంటారు కాని ఆ శబ్దం చెప్పిన భగవంతుడి హృదయాన్ని వారు పట్టుకోలేరు. అది భక్తుడికే సాధ్యం, జ్ఞానికే సాధ్యం.

భగవంతుడు మీకు కేటాయించిన పని చేయటంలో అశ్రద్ధ పనికిరాదు. సాధన చేయటంలో అశ్రద్ధ పనికిరాదు. నీలో చెడు లక్షణాలు ఉంటే వాటిని తొలగించుకోవటంలో అశ్రద్ధ పనికిరాదు. కొంతమందికి లోపల కామం ఉంటుంది, కోపం ఉంటుంది. లోపల విపరీతమైన ఆశ ఉంటుంది. పోనీ ఆశ నెరవేర్చుకోవటానికి ఏదైనా పనిచేస్తారా అంటే పని చేయకుండా సోమరితనంగా ఉంటారు. ఈ రకమైన మనుషులు చాలామంది ఉన్నారు. కలియుగానికి కలహాలయుగం, కపటయుగం అని పేరు. ఎవరైనా మంచి చెపితే వినరు, చెడ్డ చెపితే రెండు చెవులుకాదు, వెయ్యి చెవులతో వింటారు. లోపల ఆశ పెట్టుకొని ఏమీ

ఆశలేనట్లు నటించటం, ఆరోగ్యం బాగా ఉండి పనిచేయగల శక్తి ఉండి ఏమీ చేయకపోవటం, వాళ్ళ పొట్టకోసం కూడా ఇతరుల మీద ఆధారపడటం ఇలా కలియుగంలో కపటంగా జీవించేవారు ఎక్కువ అయిపోయారు. నీ శరీరానికి నియమించిన పని నువ్వు చేసుకోకపోతే ఎలాగ? పని మానివేయటం వలన ఆత్మజ్ఞానం రాదు, సోమరితనం వస్తుంది. కొంతమంది ఏమంటారు అంటే మేము బయటకురాము, నాలుగు గోడల మధ్యనే ఉంటున్నాము, మా పని ఏదో చేసుకొంటున్నాము, ధ్యానం చేసుకొంటున్నాము అని చెపుతారు. వాడు ఏమి ధ్యానం చేస్తున్నాడో వాడికి తెలియదు. వాడిలో ఎంత మురికి ఉందో వాడికి తెలియదు. సమాజం మధ్యలోనికి వస్తే నలుగురు నాలుగు మొట్టికాయలు వేస్తే వాడు ఎంత పరిశు ద్ధుడో అప్పుడు వాడికి తెలుస్తుంది. లోకంలో ఉన్న ఆకర్షణలు మనకు తెలియాలి, బలహీనతలు మనకు తెలియాలి. అందులో పడకుండా ఉండాలి, అదీ వివేకం అంటే. అందని ద్రాక్షపళ్ళు పుల్లన అనుకోకూడదు. ద్రాక్షపళ్ళు నీకు అందుబాటులో ఉండాలి. అవి తింటే వచ్చే చెడ్డ నీకు తెలియాలి, అప్పుడు తినకుండా ఉండాలి. నువ్వు నాలుగు గోడల మధ్యన కూర్చొని ఏకాంతంగా ఉన్నాను అనుకోవటంకాదు, లక్షమంది మధ్యలో ఉంటే నీ ఏకాగ్రత చెదరకూడదు, అదీ ఏకాంతం. విషయాల మధ్యలో ఉండి నిర్విషయస్థితిలో ఉండాలి, వికారాల మధ్యలో నిర్వికారంగా ఉండాలి. ఆకర్షణల మధ్యలో ఆకర్షణలు లేని స్థితిలో ఉండాలి. అది ఎడ్యుకేషన్ అంటే. కాళిదాసు ఏమన్నాడు అంటే నీకు ఎన్ని ఇంద్రియాలు అయితే ఉన్నాయో అన్ని ఇంద్రియాలకు ఆకర్షణలు ఎదురుగా ఉండాలి, అన్ని ఆకర్షణల మధ్యలో కూడా నీ ఇంద్రియాలు చెదరకూడదు, అప్పుడు ఇంద్రియజయం అంతేగాని ఆకర్షణలు లేనప్పుడు నేను ఇంద్రియాలను జయించాను అనుకోవటం పొరపాటు. నీ యోగక్షేమాల గురించే ఎప్పుడూ నువ్వు ఆలోచించుకొంటూ ఉంటే దేవుడు నీ గురించి ఆలోచించడు. యోగం అంటే మనకు లేనిది రావటం, క్షేమం అంటే ఉన్న దానిని కాపాడుకోవటం. నువ్వు నిరంతరం నీ స్వార్థం గురించే, నీ యోగక్షేమాల గురించే ఆలోచించుకోకు. అలా ఉంటే నీకు ఆత్మజ్ఞానం ఎలా కలుగుతుంది. నువ్వు సెల్ఫ్ సెంటర్డ్‌గా ఉండకు, గాడ్‌సెంటర్డ్‌గా ఉండు. అప్పుడు నీకు లోచూపు కలుగుతుంది. మనిషి స్వార్థాన్ని ఒకేసారి తగ్గించుకోలేడు, నెమ్మదిగా తగ్గించుకొంటూ రావాలి. ఏ విషయం అయినా మనకు అవసరానికి మించి ఉంటే భోగదృష్టి వచ్చేస్తుంది. భౌతిక భోగాల పట్ల స్వల్ప కాంక్ష ఉన్నా మనకు మోక్షం రాదు. నిరంతరం నీ గురించే ఆలోచించకు,

ఇతరుల గురించి కూడా ఆలోచిస్తూ ఉంటే అప్పడు నీకు స్వార్థం తగ్గుతుంది. ప్రపంచం అంతా తగులబడిపోతున్నా మన ఇంట్లో వారు మటుకు సంతోషంగా ఉంటే చాలు, ఇప్పడు మన ఆలోచన ఇలా ఉంది. ఇంత స్వార్థంతో ఉన్న మనకు ఆత్మజ్ఞానం ఎలా కలుగుతుంది.

ఏదో యజ్ఞం చేసాము. ఏదో భోగం వచ్చింది దానిని అనుభవిస్తాము. అలా అనుభవించినప్పడు దానంతట అది వెళ్ళిపోతే ఫరవాలేదు. అలా వెళ్ళదు మన మనస్సు మీద ముద్రలు వేసిపోతుంది. వాటిని రిపీట్ చేయాలని మనకు అనిపిస్తుంది. ఇది వరకు ఈ భోగం అనుభవించాము, మరల దానిని అనుభవించాలి అని ఆ భోగాల మీదకే మన దృష్టి వెళుతుంది కాని మన మొఖం జ్ఞానం వైపుకు తిరగనే తిరగదు. మీకు ఇంటినిండా భోగాలు ఉన్నాయి అనుకోండి. మీ శరీరం ఎంతకాలం ఉంటుంది. మీ శరీరం ఉండగా భోగాలు అయినాపోతాయి, ఆ భోగాలు ఉండగా శరీరం అయినాపోతుంది. నీ శరీరమే నీది కానప్పడు ఏది నీది అవుతుంది అన్నాడు బుద్ధుడు. భగవంతుడు చెయ్యమని చెప్పిన పనిని చెయ్యి, ఆయన వద్దని చెప్పిన పని జోలికి వెళ్ళవద్దు. ఆ పని ఎందుకు మానేయమన్నాడు అని తర్కించవద్దు, ఎందుచేతనంటే అది మన తలకాయకు అందదు. మనం కర్మ చేయటానికే పనికివస్తాము. పని తాలుక ఫలితం ఎప్పడు ఇవ్వాలి, ఎక్కడ ఇవ్వాలి అది ఈశ్వరుడు చూసుకొంటాడు పని చెయ్యమంటున్నాడు ఫలితం ఆశించవద్దు అంటున్నాడు. ఒకవేళ ఫలం వచ్చినా నా వల్లనే వచ్చింది, ఫలకారణం నేనే అని అనుకోవద్దు. కర్మఫలం నీ చేతిలో లేదు అని చెపుతున్నాను కాబట్టి పని దొంగలు అవ్వవద్దు అంటున్నాడు పరమాత్మ. నేను చనిపోయాక కాశీలో పుడితే బాగుండును అంటే అలా పుట్టనివ్వడు. నువ్వు ఎక్కడ పుట్టాలి, నీ తల్లితండ్రులు ఎవరు, నీకు ఎటువంటి స్నేహితులు దొరుకుతారు ఇవి అన్నీ నీ పూర్వజన్మ కర్మలబట్టి నిర్ణయిస్తాడు. నన్ను ఇక్కడ పడేయవద్దు, ఇంకోచోట పుడతాను అంటే అది నీ చేతిలో లేదు. నీ కుటుంబం, నీ స్నేహితులు, పరిసరాలు అన్నీ నీవు చేసిన కర్మనుబట్టి సిద్ధమవుతాయి. కొంతమంది పరిసరాలను బట్టి బాగుపడినవారు ఉన్నారు. కొన్ని పరిసరాలలో ఉన్న భక్తి కూడా పోతుంది. మన కర్మను బట్టి వారు, వారి కర్మను బట్టి మనం ఆ కొంపలో సిద్ధమవుతాము. ఇంక ఒకరిని చూసి ఒకరు నువ్వుకోవటం, ఒకరిని చూసి ఒకరు ఏడవటం అదే పని మనకు. ఇంక మనకు భక్తి లేదు, జ్ఞానం లేదు. లోకం గొడవలు చూసి, ప్రకృతి విషయాలను చూసి పరమాత్మను మర్చిపోవద్దు. మీరు ఎక్కడ నుండి అయితే వచ్చారో

అదిమర్చిపోవద్దు. జీవులకు తండ్రి ఈశ్వరుడే. ఆయన పాదాలను చేరుకొనేవరకు మన యాత్ర ఆగదు. గాంధీగారు భగవద్గీతకు వ్యాఖ్యానం వ్రాసి అనాసక్తియోగం అని చెప్పారు. నీ డ్యూటీ చెయ్యి ఆసక్తి పెట్టుకోవద్దు. వచ్చేది ఏదో వస్తుంది, రానిది ఏదో రాదు. ఈ రోజు ఈ పని చేసాము ఇది జరుగుతుందా జరగదా అనే గొడవలు నీకు అనవసరం. మనకు ఏదైనా విషయంలో డౌట్ వచ్చినప్పుడు అడిగి తెలుసుకోవాలి. అడిగి నేర్చుకొనేవాడికి అజ్ఞానం తొందరగా పోతుంది, సిగ్గువలన ఏమీ అడగకుండా ఉంటే చనిపోయేవరకు వాడికి అజ్ఞానం అలాగే ఉంటుంది. విద్య సముపార్జించేటప్పుడు అశ్రద్ధ పనికిరాదు, అవినయం పనికిరాదు. భగవంతుడు ఎన్ని రకాలుగా చెపుతున్నాడో చూడండి. మనం బాగుపడటంకోసమే ఇదంతా చెపుతున్నాడు. భగవంతుడు మనలను ప్రేమించినట్లు జీవుడు ప్రేమించలేడు. మనుషులు మనుషులను ప్రేమించుకొనేటప్పుడు అందులో ఎంతోకొంత స్వార్థం ఉంటుంది. మీ డ్యూటీ మీరు చెయ్యండి, ఎక్కడా ఆసక్తి పెట్టుకోవద్దు. మీరు మటుకు పాడయ్యే లక్షణాలను ఎవరికి నేర్పకండి, బాగుపడే లక్షణాలనే నేర్పండి. వారు నేర్చుకోకపోతే అది వేరే విషయం. ఒకోసారి మీరు ఎంత కష్టపడి పని చేసినా ఫలితం రాకపోవచ్చు, అప్పుడు డిప్రెషన్‌లోనికి వెళ్ళకండి. ఇక్కడ భగవంతుడు చెప్పేది ఏమిటి అంటే పరిస్థితులు ఎలా ఉన్నా బ్రెయిన్ బేలెన్స్ పోగొట్టుకోవద్దు. ఇవన్నీ భౌతిక గొడవలు, లోకం గొడవలు వీటి గురించి ఆలోచించి లోపల కుళ్ళిపోవద్దు. మీకు లాభం వచ్చినా, నష్టం వచ్చినా ఇవన్నీ ప్రకృతి గొడవలు, వీటిని చూసి బ్రెయిన్ బేలెన్స్ పోగొట్టుకోవద్దు సమానత్వం కనుక పోగొట్టుకొంటే మీరు బ్రహ్మంలో ఐక్యం పొందలేరు.

ఆత్మజ్ఞాన సముపార్జనకు అడ్డు వచ్చే వాసనలను, సంస్కారములను తొలగించటానికి గురువు రకరకాలుగా ప్రయత్నం చేస్తూ ఉంటాడు. ఇనుప సంకెళ్ళను మనం తెంచుకోగలము గాని జన్మాంతరం నుండి వచ్చే వాసనలను నరుక్కోవటం చాలా కష్టం. వైరాగ్యం అనే శస్త్రంతో వాటిని నరకాలి అని పరమాత్మ చెప్పాడు. మీకు భక్తి ఉంది అనుకోండి, వైరాగ్యం లేదు అనుకోండి, వాసనాక్షయం కాదు. ఒకోసారి గురువు నిన్ను విరుద్ధమైన వాతావరణంలో, విరుద్ధమైన మనుషుల మధ్య పడేస్తాడు. ఎందుచేతనంటే నీలో ఎంత ఓర్పు ఉంది. నీకు ఎంత సహనం ఉంది అని చూడటానికే అటువంటి పరిస్థితులు క్రియేట్ చేస్తాడు. కొంతమంది సంతానం వలన సుఖపడినవారు ఉన్నారు. కొంతమందికి వారి సంతానమే వారికి శత్రువులు.

పూర్వజన్మలో చేసిన కర్మ అంతా ఖర్చు అవ్వాలి కదా లేకపోతే లోపల మురికి పెరిగిపోతూ ఉంటుంది. లోపల ఉన్న మురికినంతా బయటకు గెంటటానికే అటువంటి పరిస్థితులను భగవంతుడు క్రియేట్ చేస్తాడు. ఆ మురికి బయటకు రాకపోతే జన్మలు పెరిగిపోతాయి.

వాడు ఎంత పండితుడు అయినా, వాడు ఎంత ధనవంతుడు అయినా వాడి కుటుంబ పరిస్థితులు ఎంత బాగా ఉన్నా ఇంద్రియనిగ్రహం లేనివాడు, మనోనిగ్రహం లేనివాడు యోగి కాలేడు. ఇంద్రియనిగ్రహం చాలా కష్టం. మీకు ఇంద్రియాలు ఉన్నాయి. వాటిని నిగ్రహంగా ఉండండి, నిగ్రహంగా ఉండండి అంటే వాటికి ఆగ్రహం వచ్చేస్తుంది. మీకు ఇంద్రియాలు ఉన్నాయి కదా వాటితో మీపని చేసుకోండి. మిగతాటైము మీ ఇంద్రియాలతో నాకు సంబంధించిన పనులు చేయండి. అంటే డైరెక్షన్ మార్చేస్తున్నాడు. ఈ ప్రపంచం రూపంలో ఉన్న వాడిని నేనే. అందుచేత ఈ ప్రపంచం ద్వారా నన్ను ఆరాధిస్తూ ఉంటే, నీ మనస్సులో నన్ను పెట్టుకొని కళ్యాణకర్మలు చేస్తూ ఉంటే, నా పని నిమిత్తం ఇంద్రియాలను ఉపయోగిస్తూ ఉంటే నీ ఇంద్రియాలు ఎడ్యుకేట్ అయిపోతాయి, అప్పుడు ఇంద్రియాలు నీ మీద తిరగబడవు అంటున్నాడు పరమాత్మ. నాకు సంబంధించిన మాటలు వినండి, నాకు ఇష్టమైన పనులు చెయ్యండి, ఎవరికైనా ఉపకారం చేస్తూ ఉంటే అందులో నేను ఉన్నాను కదా, నన్నే చూస్తూ ఆ పనులు చెయ్యండి, అక్కడ అసహనం పెట్టుకోవద్దు, చేసేది శ్రద్ధగా చేయండి అంటున్నాడు పరమాత్మ. మీరు నన్ను మరిచిపోయినా నేను మిమ్మల్ని మరిచిపోను అని గురువు చెపుతూ ఉంటాడు ఎందుచేతనంటే ఆ ప్రేమలో స్వార్థం లేదు. అందుచేత అక్కడ రియాక్షన్ ఉండదు. హ్యూమన్ లవ్ వేరు, డివైన్ లవ్ వేరు. మనం డివైన్ లవ్‌ను ప్రాక్టీసు చెయ్యాలి.

కొంతమంది ఎక్కువ కష్టపడరు, కష్టపడకపోయినా ఎక్కువ లాభాలు వస్తూ ఉంటాయి. ధనవంతులు అయిపోతారు. దీనికి కారణం ఏమిటి అని భగవాన్‌ను అడిగారు. పూర్వజన్మలకు ఈ జన్మకు సంబంధం ఉంటుంది. పూర్వజన్మలు ఈ జన్మలో వచ్చే జయాపజయాలను నిర్ణయిస్తూ ఉంటాయి. నువ్వు ఒకమంచి పని చేసావు అనుకో. ఈశ్వరుడు దానిని మర్చిపోడు. నువ్వు చేసిన కష్టం ఆయనకు అక్కరలేదు. నువ్వు ఆ పని చేసి మర్చిపో, ఆయన మర్చిపోడు, దానికి ఫలితం ఎప్పుడు ఇవ్వాలో ఇస్తాడు, ఒకోసారి ఆ ఫలితం వందజన్మల తరువాత ఇవ్వవచ్చు కాని దానిని ఆయన దాచుకోడు. నీది నీకు ఇచ్చేస్తాడు ఆయనకు ఏమీ అక్కరలేదు. మీరు పని చేసేటప్పుడు ఉసూరుమంటూ చేయవద్దు, ఆనందంగా చేయండి.

సమానబుద్ధి కలిగి ఉండటం కూడా యోగంతో సమానము. ఎవరైనా మరీ ఇబ్బంది పడేవారికి మీరు పది రూపాయలు ఎక్కువ ఇవ్వవచ్చు, ఇబ్బంది లేనివారికి పది రూపాయలు తక్కువ ఇవ్వవచ్చు. అంటే మీకు సమానబుద్ధి లేదు అని కాదు. బాహ్యావిషయాలను బట్టి సమానబుద్ధి నిర్ణయించలేము. సమానబుద్ధి ఉంటే అక్కడ అవసరాన్ని బట్టి రియాక్టు అవుతారు. ఏదైనా పని చేసేటప్పుడు హృదయంలో దోషం ఉండకూడదు. ఇతరుల క్షేమం కోరుకోవటంలో మీ బుద్ధిలో తేడా ఉండకూడదు. స్నేహితుల పట్ల, విరోధుల పట్ల బావదారిద్ర్యం ఉండకూడదు. వారు క్షేమంగా ఉండాలి, అందరికీ జ్ఞానం కలగాలి అని కోరుకోవటంలో బావదారిద్ర్యం పనికిరాదు. మీరు అందరూ శాంతిగా ఉండాలి, మీకు ఆత్మసుఖం అందాలి అని నేను పైకి అనకపోయినా నా మనస్సులో అనుకొంటాను అనుకోండి దాని ప్రభావం మీ మీద ఉంటుంది. ఒకరిమీద ఒకరికి ప్రేమ ఉన్నప్పడు, ఆ ప్రేమ నిజమైనప్పడు మాటలతో పని ఏముంది. జీవితం అన్నాక ఏవో సంఘటనలు జరుగుతూ ఉంటాయి. కొన్ని ఇబ్బందికర సంఘటనలు జరగవచ్చు, కొన్ని సంతోషకరమైన సంఘటనలు రావచ్చు. అక్కడ మీ బ్రెయిన్ ఎలా ఉందో చూసుకోండి. ప్రపంచంలో ఎవ్వరికీ రాని దుఃఖం మీకు వచ్చినా మీ భక్తి నిజమైతే, ఈశ్వరుడిపట్ల మీకు ఉన్న విశ్వాసం నిజమైతే మీ మనస్సు రవ్వంత, ముల్లంత కూడా కదలదు. అలా మీ మనస్సు చలనం లేకుండా ఉంటే ఈశ్వరుని దయ మీకు కలుగుతుంది, అప్పడు ఆయన స్వరూపాన్ని మీకు ఇస్తాడు.

మీ డ్యూటీ మీరు చెయ్యండి. పని చేసి మర్చిపోండి. భగవంతుడిని స్మరించటం మానేసి మంచిపనిచేసాను, మంచిపనిచేసాను అని అనుకొంటూ ఆ పనిని నెత్తిమీద మోయవద్దు, దాని వలన ఆరోగ్యం పాడవుతుంది. భగవంతుడికి తప్పించి నీ హృదయంలో దేనికి స్థానం ఇవ్వవద్దు. ఈశ్వర చింతన తప్పించి దేనిని చింతించినా నీకు చివరకు చీకటి మిగులుతుంది. నీ హృదయంలో ఉన్న సత్యంతో అనుబంధం పెంచుకో ఎందుకంటే అది ఒక్కటే నిజం. దానితో తప్పించి ఇంక దేనితో నువ్వు అనుబంధం పెట్టుకొన్నా నీకు దుఃఖం మిగులుతుంది, అశాంతి మిగులుతుంది. నీ చేతులతో పని చెయ్యి, మనస్సును భగవంతుడిపై పెట్టు. అప్పడు మీరు పవిత్రులు అవుతారు. ఇప్పడు మనందరం చేసే పని ఏమిటి అంటే లోకానికి దగ్గరవుతున్నాము, హృదయంలో ఉన్న అంతర్యామికి దూరమవుతున్నాము. నిజమైన

సాధకుడు అయితే వాడు ప్రపంచానికి దూరమవుతాడు, హృదయంలో ఉన్న అంతర్యామికి దగ్గరవుతాడు. మనం ఏది చేసినా ఈశ్వరుని దయను సంపాదించటానికి చెయ్యాలి. మీరు మంచి పనిచేసి వారు గుర్తించటంలేదు అనుకొంటే లోకానికి దగ్గరవుతావు, ఈశ్వరునిదయకు దూరమవుతారు. గుర్తింపులు కోరుకోవటం వలన లోకంతోటి కలిసిపోతారు. మన డ్యూటీ మనం చేసాము అనుకొంటే సరిపోతుంది. మీ పిల్లల్ని జాగ్రత్తగా పెంచండి. తరువాత వారు చూస్తారని అనుకోవద్దు. మన డ్యూటీ మనం చేసాము అయిపోయింది అనుకోవాలి కాని అంతకంటే దూరం ఆలోచించకూడదు. మీ సంతానం మిమ్మల్ని చూస్తే మంచిదే, చూడకపోతే డిప్రెషన్‌లోకి వెళ్ళకూడదు, మీ బ్రెయిన్‌ను బేలెన్స్‌గా ఉంచుకోవాలి, అప్పుడు మీ భక్తి నిలబడుతుంది. ఎక్కడా ఆశింపు వద్దు అలాగని మీడ్యూటీ మీరు మానవద్దు. మీ డ్యూటీని ఇష్టంగా చేస్తే ఆశింపు లేకుండా చేస్తే మీ లోపల ఉన్న మురికి అంతా బయటకు పోతుంది. ఒకరోజు లింకన్ స్కూలుకు వెళుతున్నాడు. ఆ ప్రక్కన డ్రెయిన్ ఒకటి ఉంది. అందులో పందిపిల్ల కొట్టుకొంటోంది. ఆ పందిపిల్ల పైకిరావాలని చూస్తోంది మరల కింద పడిపోతోంది. ఇది లింకన్ చూసాడు. లింకన్ డ్రెయిన్‌లోనికి దిగి పందిపిల్లను చేత్తోటి పుచ్చుకొని పైకి లాగేసాడు. దానికి ఫ్రీడమ్ వచ్చింది వెళ్ళిపోయింది. లింకన్ కర్మను యోగంగా చేసాడు. తరువాత లింకన్ బడికి వెళ్ళిపోయాడు. లింకన్ డ్రెయిన్‌లోనికి దిగి చాలా కష్టపడి పందిపిల్లను రక్షించాడు అని మిగతా పిల్లలు మాష్టారుకు చెపుతారు. లింకన్ నువ్వు చాలా మంచిపని చేసావు, ఆ పంది పిల్ల బాధను తొలగించావు, దానిని రక్షించావు అని మాష్టారు చెప్పారు. మాష్టారు మీరు చెప్పింది కరెక్టుకాదు, ఇలా చెపుతున్నాను కాబట్టి నన్ను క్షమించండి, నేను పందిపిల్లను రక్షించకుండా ఇక్కడకు వచ్చేస్తాను అనుకోండి నా మనస్సు పాఠాలమీద ఉండదు. ఆ పంది పిల్ల ఎంత బాధపడుతోందో అని నా మనస్సు బాధపడుతూ ఉంటుంది. ముందు నా మనస్సు బాధపడకూడదు. అందుచేత నా మనస్సులో ఉన్న బాధను తీసుకోవటానికి ఆ పందిపిల్లను రక్షించాను కాని ఆ పందిపిల్ల కోసం పందిపిల్లను రక్షించలేదు అని చెప్పాడు. అంటే ఇతరుల బాధను తాను తీసుకొన్నాడు. మనం ఏమి చేస్తాము అంటే మన బాధను ఇతరులకు గెంటేస్తాము. మనకు ఏదైనా దుఃఖం వస్తే అందరికీ పంచిపెడతాము కాని మనకు సంపద ఉంటే, శాంతి ఉంటే ఎవరికీ పంచిపెట్టము. అశాంతి ఉంటే అందరికీ పంచి పెడతాము, అదీ లోకం పరిశీలన చేసుకొంటే ఇది మనకు తెలుస్తుంది.

| సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు | |
|---|---|
| ఏప్రియల్ 12 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |
| ఏప్రియల్ 21 | అమలాపురం క్షత్రియ కళ్యాణ మండపం |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# సంస్కరణ

ఎవరి మనస్సును వారు సంస్కరించుకోవడం కన్నా మించిన పని లేనేలేదు. మన మనస్సును మనము సంస్కరించుకోకుండా, ఇతరులను ప్రపంచాన్ని మార్చాలని ఆలోచిస్తాం. మారవలసింది నా మనస్సే కాని చుట్టుప్రక్కల మనుష్యులు, ప్రదేశాలు కాదు. ఇతరుల పట్ల మన ప్రవర్తన, ఆలోచన ఎలా ఉన్నవి? అనే వివేకం మనకు లేకుండా వారిలోని దోషాలను ఎంచి తీర్పులు ఇస్తూ ఉంటాం. మన తలంపు, మాట, చేతలకు మధ్య పొంతన లేదన్న సంగతి గ్రహించం. మనము చెప్పే మాటలను మనమే ఆచరణలో పెట్టం. మనము చేసే పొరపాట్లను అంగీకరించకుండా సమర్థించుకొనే ప్రయత్నం చేస్తాం. ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలంటే మన ప్రవర్తనను, వ్యవహారశైలిని బేరీజు వేసుకొని మనస్సును సంస్కరించుకోవాలి. మనలోని దోషాలను గుర్తించి, వాటిని సరిదిద్దుకొని, మళ్ళీ మళ్ళీ జరగకుండా చూచుకోవడం మన వివేకానికి గుర్తు. మన మాట, చేతల ద్వారా ఇతరులను నొప్పించకూడదు. వివేకాన్ని, విచక్షణను సక్రమంగా ఉపయోగించుకోవాలి. వ్యక్తిభావన లేకుండా జీవించడం ద్వారా మానవులమైన మనము మహాత్ములుగా మారతాము.

**చావలి సూర్యనారాయణ మూర్తి, టీచర్, అమలాపురం**

# బలహీనతలతో పోరాటమే - సాధన

కొన్నివేల జన్మలనుంచి సంస్కారాలను ప్రోగుజేసుకొంటూ వాటిని వృద్ధి చేసుకొంటూ భవసాగరంలో ఈదలేక అలసి, సొలసి, సత్యతీరానికి చేరాలనే తపన కలిగినప్పుడు సాధన మొదలుపెడతాడు కాని శక్తి చాలదు ఓటములు కలుగుతాయి. అదే అంతకుమునుపు సాధన చేసి ఉంటే బలహీనతలపై పోరాటంలో కొంత సాఫల్యం కనిపిస్తుంది. పూర్ణత్వం సాధించాలంటే ఏడుపును పోగొట్టే ఏడుపు కావాలి. రహస్యంగా భగవంతునికోసం నిర్వేదించాలి. ఆత్మ విచారణ చేసుకోవాలి. హృదయాన్ని మథించుకోవాలి. ఏకాంతంగా భగవత్ కృపకోసం తపించాలి నీటికోసం చేపలా. మనకు తెలుసున్న రీతిలో గురుమూర్తిని ఆర్తితో ప్రార్థించాలి, దానికి మించిన సాధన లేదు. మనస్సుకు రూపం అంటే బహు ఇష్టం. గురు రూపధ్యానమే ముక్తికి దగ్గర మార్గము. జీవన్ మృతుడు ఎవరు? అంటే సోమరి మన సంస్కారాలే మన కర్మలను ప్రేరేపిస్తాయి. మన సుఖ దుఃఖాలకు మనమే కారణం. ఇతరులపై ఆరోపణలు చేయకుండా ప్రశాంత బుద్ధితో అనుభవించాలి. వర్తమానకాలంలో ఎటువంటి దోషాలు లేకుండా జీవిస్తే పవిత్రులమౌతాము. తెలిసిన దోషాన్ని వెంటనే త్యజించాలి. వివేక విరుద్ధమైన ఏ పనీ చెయ్యకూడదు. నాకు ఏదీ అవసరం లేదు అనుటయే మహా సాధన. నాది ఏదీ లేదు అంతా నీదే నీ ఇష్టప్రకారమే జీవించుటయే నా విధి అనే భావనలో ఉండాలి. శ్రీనాన్నగారు "మిమ్ములను ఎవరైనా తిడుతూ ఉంటే మీకు తట్టుకొనే శక్తి ఉంటే మీకు సాధనాబలం ఉన్నట్లు లెక్క. రెండు గొట్టెపొట్టేళ్ళు పోట్లాడుకొంటూ ఉంటే ఏది బలమైతే అది నెగ్గుతుంది. అలాగే నీ సాధనా బలం ఎక్కువ ఉంటే నీ సంస్కారాలను ఓడించగలవు" అన్నారు. మన దేహమే మనది కాదు. ఇది పంచభూత నిర్మితమైనది. ప్రపంచ భోగాలు ఈ దేహంతో అనుభవిద్దాము అనుకోవటం తెలివి తక్కువ అజ్ఞానం. మొదట ఈ విషయాన్ని గుర్తించాలి. మన పూర్వీకులు ఇలా చేసారని యాంత్రికంగా మనం పాటించకూడదు. దీనికి వివేకం, శాస్త్ర ప్రమాణం ముఖ్యము. సంశయిస్తూ ఉంటే మనస్సు ఎప్పుడూ సౌఖ్యంగా ఉండదు. లొంగిపోదు. సంపూర్ణంగా ఉండదు. మనస్సులో ఎప్పుడూ ఒక భాగం యుద్ధం చేస్తూ ఉంటుంది. దాన్ని గుర్తించి ఆపు చెయ్యాలి. పోరాటంతోనే విజయం సాధించినప్పుడే నిజమైన సంతోషం, ఆనందం కలుగుతుంది. సాధనలో గురు అనుగ్రహాన్ని ఆసరాగా తీసుకొని పనిచేస్తే అవలీలగా అంతిమ లక్ష్యం చేరగలము.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం